

సాక్షి
బాపట్ల

బుధవారం । 8 । నవంబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 524.70 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 26,509 వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 4610 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 2180 క్యూసెక్కులు వదిలారు.

అభయ ప్రదాయినిగా అమ్మవారు



పిట్టలవానిపాలెం : చందోలులోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన పూజ నిర్వహించారు. వివాహం కాని ఆడపిల్లల కోసం అమ్మవారికి ఈ పూజలు చేస్తారు.

న్యూస్‌రీల్

ఎన్‌సీసీ కోసం విద్యార్థినుల ఎంపిక



తెనాలి: ఎన్‌సీసీ 10వ ఆంధ్రా బాలికల బెటాలియన్‌లోకి ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపికను మంగళవారం స్థానిక జేఎంజే మహిళా కాలేజీలో నిర్వహించారు. ఆసక్తి గల డిగ్రీ ఫస్టియర్ విద్యార్థినులకు శారీరక పరీక్షల్లో భాగంగా పరుగు పోటీలు జరిపారు. అనంతరం పలువురు విద్యార్థినులను ఎంపిక చేశారు. కాలేజీ దశలో విద్యార్థినుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ బాగా ఉపకరిస్తుందని ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి వై.శారా నూనస్ అన్నారు. వ్యక్తిగత జీవితంలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం అలవడుతుందని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైనీ కేపీ, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ మేరీ శారద పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ ఉద్యోగాల ఫైనల్ మెరిట్ జాబితా విడుదల

నెహ్రూనగర్: విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు సంబంధించిన ఫైనల్ మెరిట్ జాబితా విడుదల చేసినట్లు విభిన్న ప్రతిభావంతుల, ట్రాన్స్‌జెండర్స్, వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. వివిధ శాఖల్లో 2022-23 సంవత్సరానికి విభిన్న ప్రతిభావంతులు(దృష్టి లోపం) గల దివ్యాంగుల కేటగిరీలకు సంబంధించిన ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్ కం-హెల్పర్, నైట్ వాచ్‌మెన్, బంగ్లా వాచర్, స్కావెంజర్, బేరర్ మొదలగు విభిన్న ప్రతిభవాంతుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల ఫైనల్ మెరిట్ జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ నందు, బృందావన్‌గార్డెన్స్‌లోని సంక్షేమ శాఖ కార్యాలయంలో నోటీసు బోర్డు నందు ఉంచడం జరిగిందన్నారు.

జీజీహెచ్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రం



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి వచ్చిన రోగుల ఆరోగ్యంపై సమాచారం ఇవ్వడంతోపాటు, వారికి వైద్య పరీక్షలు జరిగే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అర్బన్, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు సమాచార కేంద్రంలో వివిధ పరీక్షలు చేసి అవసరమైన వార్డుకు రిఫర్ చేస్తామన్నారు. సమాచార కేంద్రంలో ఒక వైద్యుడు, ఫార్మాసిస్టు, నర్సింగ్ సిబ్బంది, ఒక ఏఆర్ఎంఓ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోగులను రిఫరల్ ఆసుపత్రికి వెళ్లేందుకు రూ. 500లు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ప్రతి మొబైల్‌లో ఆరోగ్య శ్రీ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ యాప్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్ కుమార్, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ నాగళ్ల జయరామకృష్ణ పాల్గొన్నారు.

యార్డులో 31,690 బస్తాల మిర్చి అమ్మకాలు



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 30,319 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 31,690 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,200 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.23,200 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 24,400 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,166 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



వినుకొండలో జరిగిన సామాజిక సాధికార పాదయాత్రకు తరలివచ్చిన జనసందోహం



డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రజని, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

సామాజిక జైత్రయాత్ర

పల్నాడు జిల్లా వినుకొండలో కదంతొక్కిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు

- వినుకొండలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు విశేష స్పందన
- వేలాదిగా తరలివచ్చి సంఘీభావం తెలిపిన బడుగు, బలహీనవర్గాలు
- అడగడుగునా ఘనస్వాగతం
- దేవాలయాల్లో పూజలు, మహాత్ముల విగ్రహాలకు నివాళులు
- వితంరాజుపల్లి నుంచి పాదయాత్ర
- బహిరంగ సభకు తరలివచ్చిన ప్రజలు

సాక్షి, నరసరావుపేట: స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నేతృత్వంలో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర వినుకొండ రూరల్ మండలం వితంరాజుపల్లి నుంచి మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది. వేలాది మంది ప్రజలు, పార్టీనేతలు యాత్రకు స్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీలు కుంభా రవి, చంద్రగిరి ఏసురత్నం, పోతుల సునీత, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పాదయాత్రగా ప్రజలను కలుస్తూ వినుకొండ వైపు యాత్ర సాగింది. నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో



బస్సు యాత్రలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

పూజలు చేశారు. అక్కడి నుంచి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దగ్గర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గుర్రం జాషువా, జగ్జీవన్‌రాం విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత యాత్ర కొనసాగిస్తూ శివయ్య స్థూపం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వరకు యాత్ర సాగింది. పాదయాత్రలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో నడిచి తమ సంఘీబావం తెలిపారు. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అడుగడుగునా ప్రజలు పూలవర్షంతో స్వాగతం పలికారు. యాత్రకు వచ్చిన నేతలకు వినుకొండ నేతలు గజమాలతో, ఫ్లెక్సీలతో స్వాగతం పలికారు.

మార్మోగిన జగన్నామ స్మరణ...

పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్‌లో ఏర్పాటుచేసిన సామాజిక సాధికార బహిరంగ సభకు భారీ స్థాయిలో జనసందోహం తరలివచ్చింది. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సామాజిక న్యాయానికి జనం నీరాజనాలు పలికారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, మహిళలకు వైఎస్సార్ సీపీ చేసిన మేలును మంత్రులు, నేతలు వివరించారు. ఆ ప్రసంగాలను ప్రజలు ఆసక్తిగా విన్నారు. ప్రసంగాల్లో జననేత జగనన్న పేరు వినగానే ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ముఖ్యంగా '' మా నమ్మకం నువ్వే జగన్...'', '' జగన్



నేతలను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

రావాలి- జగనే కావాలి'', '' వై నాట్ 175 '' అంటూ జనం ప్రతిస్పందించారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజిక పరంగా జరిగిన మేలును ప్రజలు గుర్తు చేసుకున్నారు. తమకు జరిగిన సామాజిక న్యాయాన్ని ప్రతిధ్వనించారు. బహిరంగ సభలో మంత్రులు ఆదిమూలపు సురేష్, విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎంపీలు విజయసాయిరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, సినీ నటుడు అలీ, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు చంద్రగిరి యేసురత్నం, కుంభా రవిబాబు, పోతుల సునీత, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

సాధికారతను చేతల్లో చూపిన నాయకుడు జగన్



చరిత్రలో మరే నాయకుడు చూపని సామాజిక సాధికారతను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో చూపాడని మంత్రి విడదల రజిని అన్నారు. 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసిన ఘనత వైఎస్సార్ పీకే దక్కుతుందన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో తొలసారి ఓ బీసీ మహిళకు మంత్రి పదవీ కేటాయించి మహిళా పక్షపాత ప్రభుత్వమని నిరూపించారన్నారు. గత ప్రభుత్వ పాలనను జగనన్న పాలనతో పోల్చి చూసి వైఎస్సార్ పీకే ఓటు వేయాలన్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా వినుకొండలో అభివృద్ధి జరిగిందని అన్నారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలంటే వినుకొండ ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

–విడదల రజిని, మంత్రి

జగనన్న పాలనలోనే అభివృద్ధి



జగనన్న పాలనలోనే వినుకొండలో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. 100 పడకల ఆసుపత్రి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, రామలింగేశ్వర ఘాట్ నిర్మాణం, దేవాలయ అభివృద్ధి జరిగాయన్నారు. ఇది అభివృద్ధి కాదని నిరూపిస్తే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని బొల్లా సవాలు విసిరారు. టీడీపీ నేత చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రజల సొమ్ము దోచుకునేందుకే సమయం కేటాయించారన్నారు.

–బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే, వినుకొండ

వడ్డెర్ల కల నిజం చేసిన జగన్



స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వడ్డెర్లకు చట్టసభల్లో తొలిసారి స్థానం కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వడంతోపాటు ఓడిన తర్వాత గుంటూరు మార్కెట్ యార్డుకు మూడున్నర సంవత్సరాలు చైర్మన్‌గా పదవి కల్పించారన్నారు. తర్వాత ఎమ్మెల్సీ చేసి వడ్డెర్లకు కలగా మిగిలిన చట్టసభల్లో ప్రవేశం కల్పించారన్నారు.

–చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ

బడుగులకు గౌరవంతోపాటు పదవులు



బడుగులకు సామాజికంగా గౌరవంతోపాటు పదవులు ఇచ్చిన వ్యక్తి జగనన్న అని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. 2014-19 పాలనతో పోల్చితే ఈ ప్రభుత్వం ఎంత గొప్పదో తెలుస్తుందన్నారు. 156 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఇచ్చిన చరిత్ర వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని 175 స్థానాల్లో గెలిపించాల్సిన బాధ్యత మనందరిమీద ఉందన్నారు.

–పోతుల సునీత, ఎమ్మెల్సీ

సగర్వంగా బతుకుతున్నారు...



నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ వారి సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. చరిత్రలో బడుగు బలహీన వర్గాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉన్నారని, అణచివేతకు గురయ్యారన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో సగర్వంగా బతుకుతున్నారన్నారు. ప్రతి పేదింటి బిడ్డకు నాణ్యమైన చదువులు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు.

–కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ

రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి

- రైతులకు భరోసా
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- 1.91లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.79.87 కోట్లు జమ
- రైతుల హర్షం



రైతులకు చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, నాయకులు

బాపట్ల: రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పేర్కొన్నారు. వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం రైతులకు ఐదో ఏడాది రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమం మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో రైతులు వీక్షించేలా అధికారులు స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని రైతులకు చెక్కును జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్సీ పోతుల సునీత అందజేశారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ.. రైతుల సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. జిల్లాలో 1,91,843 మంది రైతుల కుటుంబాలకు రూ.79.87 కోట్ల నిధులు విడుదల అయ్యాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సంక్షేమ పాలన సాగుతోందని అన్నారు. రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వ్యవసాయంలో నిత్యం పండగ వాతావరణం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పంటల కోత సమయంలో రైతులను ఆదుకోవడానికి నగదు పంపిణీ చేయడం శుభపరిణామం అన్నారు. ఈ క్రాప్ బుకింగ్ నుంచి సున్నా వడ్డీతో పంటల బీమా వర్తింప చేస్తూ రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం నిలిచిందన్నారు. రైతులకు ప్రభుత్వం మేలు చేస్తుండగా వరుణుడు కూడా వర్షాలతో సహకరిస్తున్నారని చెప్పారు. వర్షాలు కురియడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మంతెన దశరథ మహారాజు మాట్లాడుతూ పంట కోత సమయంలో రైతులను ఆదుకోవడం శుభ పరిణామమని అన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. రైతులకు ఎలాంటి కష్టం రానివ్వకుండా చక్కగా పరిపాలన అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్, ఉద్యాన శాఖ ఏడీ జె.జెనెమ్మ, మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్‌బాబు, పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ హనుమంతరావు, ఏఎంసీ చైర్మన్ పి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నేడు ఇంకొల్లులో జగనన్నకు చెబుదాం

బాపట్ల: జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం ఇంకొల్లులోని శుభమస్తు కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకొల్లు మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

గోడౌన్లు పరిశీలించిన ఎస్పీ వకుల్ జిందాల్



బాణసంచా గోడౌన్‌ని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

వేటపాలెం: జిల్లాలో అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. వేటపాలెం మండలం అక్కాయిపాలెం వద్దగల బాణసంచా గోడౌన్‌ను ఎస్పీ మంగళవారం పరిశీలించారు. గోదాముల్లో అనుమతి పత్రాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం అన్ని ఉన్నాయా లేదా పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ గోడౌన్లలో ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలను నిరోధించేందుకు నీరు, ఇసుక సిద్ధంగా ఉంచాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బాణసంచా విక్రయ గోడౌన్లను పరిశీలించామన్నారు. బాపట్ల, అద్దంకి టౌన్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న రెండు బాణసంచా గోడౌన్లను సీజ్ చేశామన్నారు. బాణసంచా విక్రయించే వారు తాత్కాలిక లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వీరి వెంట డీఎస్పీ ప్రసాదరావు, చీరాల టౌన్ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై సురేష్ ఉన్నారు.

పొగాకు పంటను పరిశీలించిన విదేశీ ప్రతినిధులు



పర్చూరులో పొగాకు పంటను సందర్శించిన విదేశీ కంపెనీ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): దేశీయంగా పండిస్తున్న పొగాకు పంటను విదేశీ కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. మంగళవారం విదేశీ కంపెనీ జీపీఐ (గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియన్ లిమిటెడ్) ఆధ్వర్యంలో (పీఎంఐ) ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధులు పర్చూరు ప్రాంతంలో పండే హెచ్‌డీబీ ఆర్‌జీ బ్లాక్ బర్లీ పంటను పరిశీలించారు. కంపెనీ ప్రతినిధులు భక్తి కుర్నియేవాన్, బిమో బెయోజిలు పర్చూరులోని స్థానిక రైతులతో మాట్లాడారు. రైతులు కంపెనీ సిఫారసు చేసిన పురుగుమందులను మాత్రమే వాడాలని, పొగాకు మండె వేసేటప్పుడు తేమతో వేయడం వల్ల టీఎస్ఎన్ఏ (టొబాకో స్పెసిఫిక్ నైట్రోసమైన్స్)ను నియంత్రించవచ్చని తెలిపారు. టీఎస్ఎన్ఏపై రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పర్చూరు మార్కెట్ యార్డులో జీపీఐ కంపెనీ అభివృద్ధి చేసిన జీవవైవిధ్య ఉద్యానవనాన్ని సందర్శించారు. రైతులు చేస్తున్న అభివృద్ధిని కొనియాడారు. సీనియర్ మేనేజర్ పునీత్, మేనేజర్ ఉమామహేష్, పర్చూరు బ్లాక్ బర్లీ అసిస్టెంట్ మేనేజర్ జితేంద్రకుమార్ ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన పెంచాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల: సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 9వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ప్రదర్శన బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమాలు ఈనెల 9 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. జిల్లాలోని 477 గ్రామ, వార్డు సచివాలయాలలో ఈ కార్యక్రమాలు జయప్రదంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమాలకు సంబంధించిన 10వేల పుస్తకాలు జిల్లాకు అందాయన్నారు. 25 సంక్షేమ పథకాలు, మరో నాలుగు సంక్షేమ కార్యక్రమాలపై సవివరంగా బ్రోచర్లు, బోర్డులలోను నిక్షిప్తం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాలపై గ్రామాలలో ప్రజలకు విస్తత ప్రచారం చేపట్టాలన్నారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే' కార్యక్రమాన్ని అందులోనే నిర్వహించాలన్నారు. సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేసే కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారికి బుక్లెట్ అందించి, బయోమెట్రిక్ తో ధ్రువీకరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఈ కార్యక్రమాన్ని సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల వరకు నిర్వహించాలన్నారు. ఆరోగ్య సురక్ష మాదిరిగా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రణాళికలు రూపొందించుకుని సమర్థంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా అధికారులు, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కమిషన్ అండ

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్

చీరాల అర్బన్: బాలల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఎప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం చీరాల పట్టణ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని వైకుంఠపురంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు కస్తూర్బా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీరు, రికార్డులను పరిశీలించారు. స్టాక్ పాయింట్ తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డ నుంచి 18 ఏళ్ల వయస్సు వచ్చేవరకు బాలల హక్కుల కమిషన్ ప్రతి పిల్లవాడికి అండగా ఉంటుందన్నారు. బాలలకు ఉన్న జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ పొందే హక్కులను పొందుతూ స్వేచ్ఛగా జీవించేలా కమిషన్ పనిచేస్తుందన్నారు. అలానే బాలల హక్కులకు ఏ మాత్రం భంగం కలిగినా నేరుగా కమిషన్ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎంఈఓలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, సుధారాణి, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో అరటి గెలల లోడింగ్ కూలీ మృతి

ఇద్దరికి తీవ్రగాయాలు



కొల్లూరు: విద్యుత్‌షాక్‌కు గురై అరటి గెలలు లోడింగ్ చేసే కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని చిలుమూరు కరకట్ట వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన మెండితోక పాములు (50) అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులతోపాటు, తన కుమారుడు, తన అన్న కుమారుడితో కలసి అరటి గెలల లోడింగ్ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చిలుమూరు కరకట్ట దిగువ ప్రాంతంలో ఉన్న అరటి తోటలో అరటి గెలలు లోడింగ్ చేసిన అనంతరం మరో అరటి తోటలో గెలలు లోడింగ్ చేసేందుకు లారీతో సహా పయనమయ్యారు. అదే సమయంలో కొంతమంది ముఠా కూలీలు లారీ క్యాబిన్‌లో కూర్చోగా, పాములు తన కుమారుడు స్టీఫెన్, తన అన్న కుమారుడు మెండితోక యోహాన్, మరో వ్యక్తితో కలసి లోడ్ చేసిన అరటి గెలలపై కూర్చుని ప్రయాణిస్తున్నాడు. అదే సమయంలో విద్యుత్తు తీగలు పాములుకు తగలడంతో అతనితోపాటు, అతని కుమారుడు, అన్న కుమారుడు విద్యుత్‌షాక్‌కు గురవ్వగా, పక్కన ఉన్న వ్యక్తి లారీపై నుంచి దూకి ప్రమాదం నుంచి తప్పించుకోగలిగాడు. నేరుగా విద్యుత్తు తీగలు తగిలిన పాములు అక్కడికక్కడే మృతి చెందగా, అతని కుమారుడు స్టీఫెన్, అన్న కుమారుడు యోహాన్‌లు తీవ్ర గాయాల బారిన పడటంతో స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై కొల్లూరు ఎస్‌ఐ జి.రాజ్యలక్ష్మి బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు తెలిపారు.

బాలుడి అంత్యక్రియలు పూర్తి

- విజయవాడ బస్టాండ్‌లో బస్సు దూసుకొచ్చిన ఘటనలో ఆరునెలల బాలుడు మృతి
- పంగులూరు దళిత కాలనీలో విషాదఛాయలు

జే.పంగులూరు: విజయవాడ బస్టాండ్‌లో సోమవారం జరిగిన బస్సు ప్రమాదంలో మృతిచెందిన బాలుడికి మంగళవారం సాయంత్రం పంగులూరులో అంత్యక్రియలు జరిగాయి. విజయవాడ బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులపై బస్సు దూసుకొచ్చిన ఘటనలో ముగ్గురు మరణించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో చీరాల ఉజిలీపేటకు చెందిన మోటాని కుమారి, ఆమె ఆరు నెలల వయస్సు గల మనవడితో పాటు గుంటూరు జిల్లాకు చెందిన మరో వ్యక్తి మరణించాడు. ఆరు నెలల వయస్సు గల బాలుడి తండ్రి స్వగ్రామం పంగులూరు. పంగులూరు దళిత కాలనీకి చెందిన కాటి యలమంద చీరాల ఉజిలీపేటకు చెందిన మోటాని రాజు, కుమారిల కుమార్తె ఝాన్సీని వివాహం చేసుకున్నాడు. వీరికి నాలుగేళ్ల కుమారుడు అయాన్స్‌తో పాటు, ఆరు నెలల కుమారుడు కూడా ఉన్నాడు. యలమంద విజయవాడలో కాపురముంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మనమడికి చీరాల తీసుకొచ్చి పేరు పెట్టాలని అమమ్మ కుమారి విజయవాడలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. అల్లుడు యలమంద తిరుపతికి బాడుగకు వెళ్లటంతో అల్లుడిని తరువాత రమ్మని కుమారి ఇద్దరు మనవళ్లు, కుమార్తెను తీసుకొని సోమవారం చీరాల బయలు దేరారు.

రైలు మిస్సవ్వడంతో...

కూతురు, మనవళ్లతో కుమారి మొదట రైల్వే స్టేషన్‌కు వెళ్లగా, అక్కడ రైలు వెళ్లింది అని తెసుకుని బస్టాండ్‌కి వచ్చారు. బస్టాండ్‌లో కూర్చున్న వారిపైకి బస్సు రావటంతో కుమారి, మనవడు మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం మంగళవారం బంధువులకు అప్పగించటంతో బాలుని మృతదేహాన్ని పంగులూరు తీసుకొచ్చారు. వాటర్ బాటిల్ కొనటానికి నిన్ను, అమ్మమ్మను తీసుకెళ్లినట్లయితే ఇంత ఘోరం జరిగేది కాదయ్య.. అని బాలుడిని పట్టుకొని తల్లి ఝాన్సీ బోరున విలపించడం పలువురికి కన్నీళ్లు తెప్పించింది. బంధువులు కుటుంబ సభ్యుల రోదనల మధ్య మంగళవారం బాలుడి అంత్యక్రియలు నిర్వహించారు. బాలుడి మృతదేహానికి వైఎస్సార్ సీపీ నాయకులు, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు, గ్రామ సర్పంచి గుడిపూడి నాగేంద్రం రామారావు, షేక్ సుభాన్ సాహెబ్‌లు నివాళులర్పించారు.

ఓపెన్ స్కూల్‌తో ఎంతో ప్రయోజనం

పిట్టలవానిపాలెం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన దూరవిద్య ద్వారా చదువు మధ్యలో మానేసిన వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఓపెన్ స్కూల్స్ రాష్ట్ర డైరెక్టర్ కె.నాగేశ్వరరావు తెలిపారు. బాపట్ల జిల్లాలో మంగళవారం పర్యటించారు. ఇందులో భాగంగా పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. వివిధ కారణాల వల్ల చదువు మధ్యలో మానేసిన వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓపెన్‌స్కూలు విధానం ద్వారా పరీక్షలు రాసి అనేక రకాలైన ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. ఈసందర్భంగా ఆయనను కర్లపాలెం శ్రీభార్గవి విద్యాసంస్థల అధినేత పేరాల వెంకట సురేష్ ఘనంగా సత్కరించారు. ఓపెన్‌స్కూలు విధానంలో అత్యధిక అడ్మిషన్‌లు సాధించిన శ్రీభార్గవి స్కూలును ప్రత్యేకంగా అభినందించారు. ఓపెన్‌స్కూలు విధానం ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను గ్రామీణ స్థాయిలో వివరించి సత్ఫలితాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట రాష్ట్ర కో-ఆర్డినేటర్‌లు శ్రీనివాసులు, నరసింహులు, చందోలు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పొదిలి వీరయ్య, ఓపెన్‌స్కూలు సిబ్బంది ఉన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన అవసరం

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవ సదస్సు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ప్రిన్సిపాల్ డాక్టర్ నజీర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ

బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ క్యాన్సర్ అగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నజీర్ షేక్ మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సలో సహాయపడే న్యూక్లియర్ ఎనర్జీ రేడియో థెరపీ అభివృద్ధికి కారణమైన ప్రయోగం చేసిన నోబెల్ గ్రహీత మేడం క్యూరీ జయంతిని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ప్రజలలో చైతన్యం తీసుకొని రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాపట్ల జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.విజయమ్మ మాట్లాడుతూ క్యాన్సర్ కారణాలు, లక్షణాలు, నివారణ, చికిత్స గురించి విద్యార్థులకు వివరించారు. డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మనదేశంలో ఏడు రకాల క్యాన్సర్లతో ప్రజలు బాధపడుతున్నారన్నారు. లంగ్స్, బ్రెస్ట్, నోటి, గర్భాశయ, కడుపు, అన్నవాహి, లివర్ క్యాన్సర్‌తో ఎంతో మంది బాధపడుతున్నారని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్లను నివారించవచ్చన్నారు. దంత వైద్యులు డాక్టర్ శశి కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నివారణ గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల విద్యార్థుల అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ డి. నిరంజన్ బాబు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి అతి ప్రమాదకరమైనదన్నారు. దీనిపై అపోహలు ఉన్నా వాటిని నివృత్తి చేసేందుకు చేపడుతున్న ప్రభుత్వ, ఎన్జీఓ కార్యక్రమాలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. కొందరు ధూమపానం, మద్యపానం, గుట్కా వంటి వ్యసనాలకు అలవాటుపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్స్ కె.రాజేంద్ర, వై.శృతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి హాకీ చాంపియన్‌షిప్‌కు జమ్ములపాలెం విద్యార్థిని


అనురాధను అభినందిస్తున్న దృశ్యం

బాపట్ల అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి హాకీ చాంపియన్‌షిప్ అండర్-17 బాలికల విభాగంలో హాకీ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో జమ్ములపాలెం హై స్కూల్ విద్యార్థిని బి.అనురాధ ఉత్తమ ప్రదర్శన కనబరిచి బెంగళూరులో జరగనున్న జాతీయ హాకీ చాంపియన్‌షిప్‌కు ఎంపికైంది. ఈమేరకు విద్యార్థి అనురాధను మంగళవారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారావు, సర్పంచ్ బోయిన వెంకటేశ్వరమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.సురేష్, గ్రామ పెద్దలు పువ్వాడ బసంత్ కుమార్, ఎ.సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ అప్సర, పంగులూరి బుజ్జి, గ్రామస్తులు ఉపాధ్యాయులు, పీడీ బి. వీరచంద్రులు అభినందించారు.

జాతీయ యోగా పోటీలకు చందలూరు విద్యార్థులు..

జే.పంగులూరు: జాతీయస్థాయి యోగా పోటీలకు చందలూరు పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు కొండా ప్రతిమ మంగళవారం తెలిపారు. పశ్చిమ గోదావరిలోని వీరవాసరం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈనెల 1 నుంచి 3వ తేదీవరకు ఇంటర్ యోగా టోర్నమెంట్ ఎంపికలు జరిగాయి. ఈ పోటీలు 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అండర్-14 బాలికల విభాగంలో చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని నాయపాము శృతి రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. అలాగే 8వ తరగతి విద్యార్థిని నాయపాము సుప్రియ రెండో స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం గిరిజ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

బాపట్లటౌన్: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాపట్ల పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ శ్రీనివాసులు సమాచారం మేరకు ఇంకొల్లు మండలం, దుద్దులూరు గ్రామానికి చెందిన మల్లెం వంశీ (21) బాపట్ల పట్టణంలోని జగన్నాధపురంలో అద్దెకు ఉంటూ బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వంశీ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వంశీని స్నేహితులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదరీతిలో వ్యవసాయ కళాశాల విద్యార్థిని..

బాపట్లటౌన్: బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం వ్యవసాయ కళాశాలలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు విజయవాడకు చెందిన రిషిత (24)బాపట్ల వ్యవసాయ కళాశాలలో మూడవ సంవత్సరం విద్యను అభ్యసిస్తుంది. మంగళవారం ఉదయం అల్పాహారం తీసుకోవడానికి వెళుతుండగా ఒకసారిగా కుప్పకూలి కింద పడిపోవడంతో కళాశాల అంబులెన్స్‌లో పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాల వద్దకు తీసుకువెళ్లగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తోటి విద్యార్థులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించిగా అప్పటికే విద్యార్థిని మృతిచెందిందని వైద్యులు తెలిపారు. విద్యార్థిని మృతిపై తల్లిదండ్రులు అనుమానం ఉందని ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు చెప్పారు. తోటి విద్యార్థిని మృతి చెందడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు వైద్యశాల వద్దకు చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు.

అదుపుతప్పిన కూలీల బస్సు

- నలుగురికి గాయాలు
- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం


ప్రమాదానికి గురైన బస్సు

మేదరమెట్ల: వలస కూలీలతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని జాతీయ రహదారి కొరిశపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు..ఒంగోలు వైపు నుంచి జార్ఖండ్‌కు వలస కూలీలతో వెళ్తోంది. బస్సు కొరిశపాడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపానికి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో బస్సు ఒక్కసారిగా రోడ్డు మార్జిన్ వైపు వెళ్లి ఫెన్సింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న నలుగురికి గాయాలు కాగా, వారిని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 మంది ఉన్నారు. అదృష్టవశాత్తు బస్సు మార్జిన్ వైపు వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో బస్సులోని వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

మార్టూరులో చోరీల కలకలం

- ఆరు షాపుల్లో చోరీకి యత్నం
- రెండు దుకాణాల్లో ఎలక్ట్రానిక్ సామగ్రి, సెల్‌ఫోన్‌లు చోరీ


వాసవీ సెల్ షాపులో సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు


సీసీ కెమెరాలో కనిపిస్తున్న నిందితులు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో దొంగలు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. అందినకాడికి దోచుకుంటూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. మార్టూరులో దుండగులు ఆరు దుకాణాల్లో చోరీకి ప్రయత్నించి రెండు షాపుల్లో చోరీ చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం అర్ధరాత్రి తరువాత రెండున్నర గంటల నుంచి 4 గంటలు మధ్య చోరీలు జరిగినట్లుగా సీసీ ఫుటేజీలో రికార్డయింది. ఆటోలో ఇద్దరు యువకులు జాతీయ రహదారి పక్కన ఉన్న సూర్య టీ స్టాల్, వాసవీ మొబైల్ షాపుల్లో మొదట షట్టర్ తాళాలు ధ్వంసం చేసి విఫలమయ్యారు. తరువాత సమీపంలోని రాందేవ్ బాబా మొబైల్ షాపు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి రిపేరు కోసం కస్టమర్‌లు ఇచ్చిన 9 సెల్‌ఫోన్‌లు చోరీ చేశారు. అనంతరం స్థానిక ఇస్మాయిల్ టీ స్టాల్ పరిసరాల్లో మరో మూడు దుకాణాల షట్టర్ల తాళాలు ధ్వంసం చేసేందుకు యత్నించారు. ఆ తరువాత కొణిదెన సెంటర్‌లోని ఏఆర్ ఎలక్ట్రికల్ షాపు షట్టర్ తాళాలు ధ్వంసం చేసి అందులోని 3 టీవీలు, 10 ఫ్యాన్‌లతో పాటు 3 హోం థియేటర్‌లను నిందితులు ఆటోలో తరలించుకు వెళ్లారు. మంగళవారం ఉదయం స్థానికులు, షాపుల యజమానుల సమాచారం మేరకు ఎస్‌ఐ శ్రీనివాసరావు చోరీ జరిగిన తీరును పరిశీలించి ఒంగోలు నుంచి క్లూస్ టీంను పిలిపించారు. క్లూస్ టీం సిబ్బంది వాసవీ మొబైల్ షాపు ముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలో ఆధారాలను, షాపుల్లో వేలి ముద్రలను తీసుకున్నారు. సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న ఆటోడ్రైవర్‌తో సహా ఇద్దరు యువకుల వివరాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హెచ్‌ఎం వైఖరిపై విద్యార్థి, తల్లి నిరసన

- ఆయా విధుల నుంచి తొలగించడంతో తల్లి, అకారణంగా టీసీ ఇవ్వడంతో కుమారుడు నిరసన
- ఈపురుపాలెం జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఘటన


పాఠశాల ఎదుట మీడియాతో మాట్లాడుతున్న విద్యార్థి తల్లి అనూష

చీరాల అర్బన్: అకారణంగా పాఠశాల నుంచి తొలగించడమే కాకుండా తన కుమారుడికి టీసీ ఇచ్చారంటూ తల్లీకొడుకులు నిరసన వ్యక్తం చేశారు. ఈఘటన మంగళవారం చీరాల రూరల్ మండలంలోని ఈపురుపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. బాధితులు, హెచ్‌ఎం తెలిపిన వివరాల మేరకు.. ఈపూరుపాలెంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో దేవరపల్లి అనూష ఆయాగా పనిచేస్తోంది. అలానే అదే పాఠశాలలో ఆమె కుమారుడు అఖిల్‌రాజు పదో తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో పాఠశాలలో ఆయా పోస్టు నుంచి హెచ్‌ఎం రత్నావళి అకారణంగా తొలగించారని, తన కుమారుడికి కూడా ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ ఇచ్చారంటూ మంగళవారం ఇద్దరూ స్కూల్ ముందు నిరసన తెలిపారు. తనను ఎందుకు తొలగించారో చెప్పాలని దేవరపల్లి అనూష డిమాండ్ చేశారు. తనను ఉద్యోగం నుంచి తొలగించడంపై డీఈఓకు ఫిర్యాదు చేశానని, ఆ కారణంగా తన కుమారుడికి టీసీ ఇచ్చి స్కూల్ నుంచి పంపించేశారని వాపోయింది. తనకు న్యాయం చేయాలంటూ ఆమె మీడియా ముందుకు వచ్చింది.

హెచ్‌ఎం వివరణ ఇలా...

ఈ విషయమై హెచ్‌ఎం రత్నావళిని వివరణ కోరగా గతంలో పాఠశాలలో 400 మందికి పైగా విద్యార్థులు ఉండడంతో ఇద్దరు ఆయాలను నియమించామన్నారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఒకరిని తొలగించామన్నారు. ఆయాగా పనిచేస్తున్న అనూష విధులకు సక్రమంగా రావడం లేదని, దీంతో పాఠశాల విద్యా కమిటీ తీర్మానం మేరకు ఆమెను తొలగించామన్నారు. అలానే విద్యార్థి ప్రవర్తన సరిగా లేదని, పలువురు ఉపాధ్యాయులు కూడా తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. పాఠశాలకు చెడ్డపేరు రాకుండా టీసీ ఇచ్చామన్నారు. అలానే మరో విద్యార్థికి కూడా టీసీ ఇచ్చామన్నారు చెప్పారు. అయితే ఈ వ్యవహారం వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడంపై ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది.

హత్య కేసులో నలుగురికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష

నగరంపాలెం: 2016లో జరిగిన హత్య కేసులో నలుగురికి మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా రెండో అడిషనల్ జడ్జి మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళ్తే..పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో జరిగిన ఓ హత్యపై క్రైం నంబర్ 49/2016 యు/ఎస్ 302, 324, 323, 506 ఐపీసీ కింద కేసు నమోదైంది. నిందితులైన పల్నాడు జిల్లా గురజాల మండలం జంగమేశ్వరపాడుకి చెందిన పాశం వెంకటేశ్వరరావు, నల్లగొర్ల కొండలు, మంచి కృష్ణ, తండా లాలు అనే నలుగురు ముద్దాయిలకు మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ రెండో జిల్లా జడ్జి తీర్పు వెల్లడించారు. గతంలో సీఐగా విధులు నిర్వహించిన స్వర్గీయ శేషారావు దర్యాప్తు చేపట్టారు. నిందితుల్ని అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రాల్ని దాఖలు చేశారు. పోలీస్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మధుసూదనరావు వాదనలు వినిపించగా, పెదకాకాని పోలీసులు, కోర్టు మానిటరింగ్ సెల్ సాక్షుల్ని సకాలంలో హాజరుపరిచారు. నిందితులకు శిక్ష పడేలా దర్యాప్తు చేపట్టిన పోలీస్, ప్రాసిక్యూషన్ అధికారులను గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, గుంటూరు జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అభినందించారు.